కీసరగుట్టలో ఎమ్మెల్సీ పూజలు

కీసర, మార్చి 16: కీసరగుట్ట భవానీ రామలింగేశ్వరస్వామికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పీఆర్‌టీయూఎస్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్ రెడ్డి,ఉపాధ్యాయ సంఘాల నేతలతో కలిసి ఆదివారం స్వామివారి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణమందిరంలో ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డి, వేదపండితులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రామేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, మండల అధ్యక్షులు యాదగిరి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఎంఈఓ శశిధర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం రవీందర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నేడు మహాధర్నా

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 16: మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ఈనెల 17, 18వ తేదీల్లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా సీఐటీయూ కార్యదర్శి ఉన్నీ కృష్ణన్ తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైయిందని,అందుకు నిరసనగా రెండు రోజుల పాటు కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు.

నేడు ప్రజావాణి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 16 : కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జోనల్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజావాణిలో జోనల్ కమిషనర్‌తో పాటు పలువురు అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారని ప్రజలు తమ సమస్యలను విన్నవించాలని సూచించారు. అదేవిధంగా కూకట్‌పల్లి మూసాపేట్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కొనసాగుతుందని డిప్యూటీ కమిషనర్లు గంగాధర్ వంశీకృష్ణ తెలిపారు.

సీఎం సహాయ నిధి.. పేదల ఆరోగ్య పెన్నిధి

• బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్,మార్చి 16: ముఖ్యమంత్రి సహాయ నిధి.. పేదల ఆరోగ్యానికి పెన్నిధి అని బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సుభాష్‌నగర్ ప్రాంతానికి చెందిన మైలారం భార్గవి, గాజుల రామారం ప్రాంతానికి చెందిన షాజత్ బేగం ఆరోగ్యం బాగోలేక పోవడంతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను ఆశ్రయించారు. వారి ఆర్థిక, ఆరోగ్య పరిస్థితిపై చలించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మైలారం భార్గవికి రూ.1,25,000, షాజ త్‌బేగంకు రూ. 2 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఆదివారం చింతల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎల్‌ఓసీ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి ఆరోగ్య భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సుభాష్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏల జేఏసీ ప్రతినిధులు

వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకు వినతి

వీఆర్‌ఏల సమస్యలను చట్టసభల్లో చర్చించి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు ఆదివారం వీఆర్‌ఏల జేఏసీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న వీఆర్‌ఏల సర్వీస్ ఉత్తర్వుల సమస్యను పరిష్కరించాలని, అపరిష్కృతంగా ఉన్న పోస్టింగ్‌లతో పాటు గత రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతభత్యాలను వెంటనే విడుదల చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. 2023 ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన వీఆర్‌ఏల సర్వీస్ ఉత్తర్వులను పునఃపరిశీలించి వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ సర్వీస్ ఉత్తర్వులను విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏ జేఏసీ సభ్యులు రాజశేఖర్, రవి సాగర్, సంగమేశ్వర్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర, నృత్య ప్రదర్శనలు

నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

కొండాపూర్, మార్చి 16 : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు కళాకారుల గాత్ర, నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో భాగంగా చెన్నై నుంచి విచ్చేసిన భరతనాట్య కళాకారిణి వర్షరాజ్ కుమార్ అర్ధనారీశ్వర స్తోత్రం, కంజదళయాదాక్షి, అన్నమయ్య కీర్తన, మీరా భజన, తిల్లాన అంశాలను భరతనాట్య రూపంలో ప్రదర్శించి మెప్పించారు. స్నేహ రాంచందర్ శిష్య బృందం సంగీత కచేరిలో ఏకదంతం వినాయక, నమో శారదా, రామ రామ, శంకర పూజితేయ్, ఎందుకయ్యా సాంబశివ, అంబుజవాసిని, జయ జయ ప్రియభారతి పాటలను దివ్య, అనన్య, లహరి, హితేశ్ తదితరులు ఆలపించారు. అనంతరం కూచిపూడి నృత్య ప్రదర్శనలో భాగంగా గజానయుతం, తుంబుర మీటేదెవ, జతిస్వరం, రామదాసు కీర్తన, జనుత శబ్దం, ఆధ్యాత్మరామాయణ కీర్తన అంశాలను తాన్యా శ్యామా, ఆధ్య, నేహా, నైతిక, సాయి శ్రీక్షిత, అవంతిక, కీర్తిక, అడ్వికా కృషిత ప్రదర్శించిన తీరు ఆద్యంతం ఆకట్టుకుంది. నాట్య గురువులు పద్మ కళ్యాణ్, నిరంజన్ విచ్చేసి కళాకారులను అభినందించారు.

పోగొట్టుకున్న బ్యాగు తిరిగి అప్పగింత

మియాపూర్, మార్చి 16; నగదు ఉన్న బ్యాగును పోగొట్టుకున్న వ్యక్తికి కానిస్టేబుల్ తిరిగి అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధి ఆల్విన్ చౌరస్తాలో కంసాలి పనిచేసే మధుసూదన్ రావు ద్విచక్ర వాహనంపై వెళ్తూ తన బ్యాగు ను జారవిడుచుకున్నాడు. అదేప్రాంతంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ రాజేశ్ బ్యాగును గుర్తించి తెరిచి చూడగా అందులో డబ్బులు ఉన్నట్లు గుర్తించాడు. వెంటనే ఆ బ్యాగును మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. అనంతరం బాధితుడు మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లో సంప్రదించగా వివరాలు తెలుసుకుని పోగొట్టుకున్న నగదు బ్యాగును ట్రాఫిక్ ఎస్‌ఐ నవీన్‌కుమార్ సమక్షంలో బాధితుడికి అందజేశారు నిజాయితీని చాటుకున్న ఏఆర్ కానిస్టేబుల్ రాజేశ్‌ను పోలీస్ అధికారులు అభినందించారు.

బాధితుడు మధుసూదన్‌రావుకు బ్యాగును అందజేస్తున్న ట్రాఫిక్ పోలీస్ అధికారులు

పేద రోగులకు కార్పొరేట్ వైద్యం అందించాలి

ఖైరతాబాద్, మార్చి 16 : పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందించాలనే లక్ష్యంతో కొనసాగుతున్న వాసవి హాస్పిటల్ సేవలను మరింత విస్తృత పర్చాలని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశ్ కోరారు. ఖైరతాబాద్‌లోని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా జయప్రకాశ్ రామ్, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున్, కోశాధికారిగా దయాకర్ గుప్తా ఎన్నికయ్యారు.

గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకులు అరెస్టు

దుండిగల్, మార్చి 16: పార్కులో గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకులను బాచుపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. వీరిలో నలుగురు విద్యార్థులు కాగా ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ప్రగతినగర్ ఆర్కే లేఅవుట్, మిథులానగర్ లోని అబ్దుల్ కలాం పార్క్‌లో శనివారం రాత్రి ఐదుగురు వ్యక్తులు సిగరెట్ల మాటున గంజాయి సేవిస్తున్నట్టు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఎస్సై హరీశ్ సిబ్బందితో కలిసి పార్కులోకి వచ్చారు. గమనించిన సదరు యువకులు తమ చేతిలోని గంజాయి సిగరెట్లను కిందపడేసి అనుమానాస్పదంగా వ్యవహరిస్తుండటంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయి సేవిస్తున్నట్లు అంగీకరించారు. వెంటనే ఐదుగురిని ఎన్డీపీఎస్ యాక్ట్ కింద అరెస్ట్ చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, కేపీహెచ్‌బీ అడ్డగుట్టలోని బాలాజీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న ఏపీలోని వైయస్సార్ కడప జిల్లాకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి (26), ప్రగతి నగర్ లోని పీపుల్స్ హాస్పిటల్ సమీపంలో నివా సం ఉంటున్న విద్యార్థి అరవపల్లి దుర్గాప్రసాద్(19), గాజులరామారం డివిజన్ రోడామేస్త్రీనగర్‌కు చెందిన విద్యార్థి జరపాల ప్రశాంత్‌నాయక్(19), నిజాంపేటలోని రాజధాని స్కూల్ సమీపంలో వెంకటసాయి రెసిడెన్సీలో ఉంటున్న కసినా తనూజ్ నాగ కుమార్(20), ప్రగతినగర్ కాకతీయ హిల్స్ లో ఉంటున్న విద్యార్థి కొంగర సాయి బాలాజీ(19) ఉన్నారు.

కాగా వీరందరికీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వేణుగోపాల్‌రెడ్డి గంజాయి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. వారి వద్ద 60 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన బైక్ ర్యాలీ

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఏసీపీ సత్యనారాయణ తదితరులు

కొండాపూర్, మార్చి 16 : ప్రపంచ మూత్రపిండాల దినోత్సవాన్ని పురస్కరించుకొని మెడికవర్ హాస్పిటల్స్, హార్లీ డేవిడ్సన్ బైకర్స్ సంయుక్తంగా ఆదివారం కిడ్నీ వ్యాధులపై అవగాహన పెంచేందుకు హైటెక్‌సిటీలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిడ్నీ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. నెఫ్రాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ కమల్‌కిరణ్ మాట్లాడుతూ.. మూత్రపిండాల సమస్యలను పట్టించుకోకపోవడంతో అవి పాడయ్యే అవకాశం ఉంటుందన్నారు. సమస్యను ప్రారంభ దశలోనే గుర్తిస్తే నయం చేయగలుగుతామన్నారు. కార్యక్రమంలో వైద్యులు, బైకర్స్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

రోగులకు మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ

దుండిగల్, మార్చి 16: ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతాయని సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. డివిజన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్‌లో ప్రాణధార హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం కార్పొరేటర్ ప్రారంభించారు. సందర్భంగా ఆయనతో పాటు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కార్పొరేటర్ వైద్య పరీక్షలు చేయించుకున్న పలువురికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కృషి కాలనీ' అధ్యక్షుడిగా సత్యనారాయణగౌడ్

జీడిమెట్ల, మార్చి 16: సుభాష్‌నగర్ డివిజన్ పరిధి కృషి కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా సత్యనారాయణగౌడ్ ఎన్నికయ్యారు. కృషి కాలనీలో మొత్తం 264 ఓట్లు ఉన్నాయి. ఆదివారం జరిగిన ఎన్నికల్లో 262 ఓట్లు పోలాయ్యాయి. అధ్యక్షుడిగా ఎన్నికైన సత్యనారాయణగౌడ్‌కు 135 ఓట్లు పోలవ్వగా ప్రత్యర్థి మజీద్ పాషాకు 124 ఓట్లు వచ్చాయి. 11 ఓట్ల తేడాతో సత్యనారాయణగౌడ్ ఎన్నికల్లో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అనంతరం సత్యనారాయణగౌడ్ కాలనీలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆయన్ను పలువురు అభినందించారు.



సత్యనారాయణగౌడ్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కు శుభాకాంక్షలు

చంపాపేట, మార్చి 16: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన రాజకీయ నేత విశ్వకర్మ, స్వర్ణకార ఉమ్మడి సామాజిక వర్గాల ముద్దుబిడ్డ దాసోజు శ్రవణ్ కుమార్‌ను బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా నియమించిన సందర్భంగా, విశ్వకర్మ మనుమయ సంఘం తెలంగాణ అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారి నేతృత్వంలో ఇరు సంఘాల నాయకులు ఆదివారం శ్రవణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని కమ్మరి, వడ్రంగి సంఘాల తరపున, రాజకీయ విశ్లేషకుడు దాసోజు శ్రవణ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన మొదటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

దుండిగల్, మార్చి 16: సీఎం సహాయనిది పేదలకు వరంగా మారిందని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. నియోజకవర్గానికి చెందిన కొట్టె రామాంజనేయులు, సునావత్ శంకర్ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందేందుకు స్థోమత లేక మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను ఆశ్రయించారు. దాంతో ఆయన సీఎం సహాయనిధికి సిఫారసు చేయగా ప్రభుత్వం వారికి ఒక్కొక్కరికి రూ. 40వేల చొప్పున సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు చేసింది. ఆ చెక్కులను ఆదివారం లబ్ధిదారులకు గాజురామారంలోని తన కార్యాలయంలో శ్రీశైలంగౌడ్ అందజేశారు. పేదలకు సీఎం సహాయనిధి ఎంతో మేలు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, అరుణ్, ఆంజనేయులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మాదాపూర్, మార్చి 16: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం... మాదాపూర్‌లోని 100 ఫీట్ల రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికంగా విచారించగా వివరాలు తెలియరాలేదు. మృతుడు 5'6 అడుగుల ఎత్తు, నీలిరంగు చొక్కా, బూడిద రంగు జీన్స్ ధరించి ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడు లేబర్ పని చేసే వ్యక్తిగా భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 16 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతు బజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు(కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 11, వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జిమిర్చి 23, కాకరకాయ 40, బీరకాయ 35, క్యాబేజీ 10, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యారెట్ 18, కాలీఫ్లవర్ 18, దొండ 40, చిక్కుడు 55, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 15, క్యాప్సికం 33, ఆలుగడ్డ 21, కీర 15, దోసకాయ 23, సొరకాయ 15, పొట్లకాయ (1) 18, కందగడ్డ 65, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 24, చింతకాయ –, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 45 రూపాయలుగా ఉన్నాయి.

రెచ్చిపోతున్న పెట్రోల్ దొంగలు

వెంగళరావునగర్, మార్చి 16 : పెట్రోల్ దొంగలు పెట్రేగిపోతున్నారు. రాత్రి వేళల్లో ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైకుల్లోని పెట్రోల్‌ను దొంగలు అపహరించుకెళ్తున్నారు. మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంగళరావు నగర్ కాలనీలో అర్ధరాత్రి దాటాక స్కూటీ, మోటార్‌సైకిల్‌పై వచ్చిన దొంగలు బైకుల్లోని పెట్రోల్‌ను బాటిళ్లల్లో నింపుకుని వెళ్తున్నారు. పెట్రోల్ తీసిన తర్వాత పైపును అలాగే వదిలేయడంతో పెట్రోల్ రోడ్డుపై పోతుంది. ఉదయం చూసుకుంటే బైకులోని పెట్రోల్ ఖాళీ అవుతుంది. శనివారం అర్ధరాత్రి దాటాక యువకులు పెట్రోల్ చోరీకి పాల్పడ్డారు.

క్షత్రీయులు అన్ని రంగాల్లో రాణించాలి

రామంతాపూర్, మార్చి 16 : సోమవంశ సహస్రార్జున క్షత్రీయ ఖత్రి ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారం ఉప్పల్ ఆత్మ గౌరవ భవన్‌లో ఆదివారం జరిగింది. క్షత్రీయ సమాజ్ ప్రాంతీయ కమిటీ అధ్యక్షులుగా రిటైర్డ్ ఐపీఎస్ డాక్టర్ విశ్వనాథ్ రవీందర్,అఖిల భారతీయ క్షత్రియ సమాజ్ ఉపాధ్యక్షులు విశ్వనాథ్ బాలకిషన్ హాజరై నారు. రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ రవీందర్‌తోపాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. సమాజ అభివృద్ధికి సంక్షేమానికి ప్రతి ఒక్కరు పాటు పడాలన్నారు.క్షత్రీయులు అందరు కలిసికట్టుగా ఉండి అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు విశ్వనాథ్ ఆశోక్,టంక్ విష్ణు,పూజారి రాజేశ్వర్, దినేశ్ వైద్య, నర్సింహరావు, గణేశ్, మీనాక్షి దొండి,విశ్వనాథ్ విశాల్,తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

కరాటే, కుంగ్‌ఫూలో సత్తా చాటిన విద్యార్థులు

కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో ప్రతిభ చూపిన చందానగర్ చాంపియన్ అకాడమీ విద్యార్థులు

మాదాపూర్, మార్చ్ 16: చందానగర్ చాంపియన్ కిక్ బాక్సింగ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ డి. లక్ష్మణ్ ఆధ్వర్యంలో 3వ నేషనల్ కరాటే తైక్వాండో, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్–2025 రాష్ట్ర స్థాయి పోటీలు జరి గాయి. యూనివర్సల్ 369 షోటోకాన్ కరాటే అకాడమీ నిర్వహణలో ఆదివారం మేడ్చల్‌లో జరిగిన కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో పలువురు విద్యార్థులు సత్తాచాటారు. వీరిలో ఎం. ధనుశ్‌రెడ్డి, ఎ. రోహిత్ హనుమాన్, అకిల్, గీతాకృష్ణ, ఏకాంశ్, శివదుర్గ, కె. గోవర్ధన్ గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకోగా ఎం. రిషికేశ్వర్‌రెడ్డి, జిష్ణువర్ధన్, డి.పార్థు, ప్రజయ్ సిల్వర్ మెడల్స్ దక్కించుకున్నారు. అనంతరం యూనివర్సల్ 369 షోటోకాన్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు శిహాన్ జి. సాయి కుమార్, కోచ్ లక్ష్మణ్‌తో కలిసి విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. కోచ్ లక్ష్మణ్‌తోపాటు పోటీలో ఘన విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు.

మాదిగలకు ఇచ్చిన మాటకు సీఎం కట్టుబడి ఉండాలి

కీసర, మార్చి 16:పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టామని మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కొమ్ము సుదర్శన్ అన్నారు.కీసరలో చేపట్టిన ఎమ్మార్పీఎస్ దీక్షలు ఆదివారం 6వ రోజుకు చేరుకున్నా యి. ముఖ్యఅతిథిగా మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు సుదర్శన్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలను ఇచ్చిన మాటలకు కట్టుబడి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాస్, బాల్‌రాజ్, శ్యాంసుందర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జర్నలిజంలో స్వీయ నియంత్రణ అవసరం

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ఖైరతాబాద్, మార్చి 16: జర్నలిజంలో స్వీయ నియంత్రణ ఎంతో అవసరమని , జర్నలిస్టులను నియంత్రించే అవకాశాన్ని ప్రభుత్వాలకు ఇవ్వవద్దని వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమ జర్నలిస్టు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 'సోషల్ మీడియా భాష సమంజసమేనా...?, సోషల్ మీడియా పార్లమెంటరీ భాష, స్వీయ నియంత్రణ' అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ .. చరిత్ర చాలా భయంకరమైందని... పాఠాలు నేర్చుకోకపోతే పునరావృతమవుతుందన్నారు. జర్నలిస్టులకు ప్రత్యేక హక్కులు ఉన్నాయన్న అపోహలు వీడాలని, అందరికీ భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందని, కానీ బూతు ప్రకటన స్వేచ్ఛ ఉండవద్దన్నారు. సీపీఐ నేత చాడా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తు తం మీడియా కంటే సోషల్ మీడియా వ్యాప్తి చెందుతోందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుతున్న తరుణంలో సోషల్ మీడి యా విస్తరిస్తుందన్నారు. మీడియాకు తప్పని సరిగా స్వేచ్ఛ ఉండాలని, హద్దులు ఉండాలన్నారు. నేడు సోషల్ మీడియాలో ఫేక్ సమాచారం ఆందోళన కలిగిస్తుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ ఉద్యమ జర్నలిస్టు సం ఘం అధ్యక్షుడు రహమాన్, సీనియర్ జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

స్నేహపురి కాలనీ అధ్యక్షుడిగా వినోద్‌యాదవ్

వినోద్‌యాదవ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి సురేందర్‌గౌడ్

అల్లాపూర్, మార్చి 16: స్నేహపురి కాలనీ సంక్షేమ సంఘం జరిగిన ఎన్నికల్లో వినోద్ యాదవ్ విజయం సాధించాడు. మొత్తం 568 ఓట్లు ఉండగా, ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులు నారాయణరెడ్డి, వినోద్ పోటీ పడ్డారు. 400 మంది ఓట్లు వేయగా నారాయణరెడ్డికి 119 ఓట్లు, వినోద్‌యాదవ్‌కు 280 ఓట్లు లభించాయి. 1 ఓటు చెల్లనిదిగా గుర్తించారు. 160 ఓట్ల మెజార్టీతో వినోద్‌యాదవ్ గెలుపొందినట్లు ఎన్నికల అధికారి సురేందర్‌గౌడ్ ప్రకటించారు. ఈ మేరకు ఆయనకు ఎన్నికల అధికారి నియామకపత్రాన్ని అందజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఘట్‌కేసర్,మార్చి 16: పేదలకు వైద్య సేవలందించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుండాలని ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి మహిపాల్ గౌడ్ అన్నారు. ఎన్‌ఎఫ్‌సీనగర్‌లోని బస్తీ దవాఖాన ఆవరణలో సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చందుపట్ల వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లింగస్వామి, ట్రస్ట్ చైర్మన్ సుందర్ రావు, కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు వీరారెడ్డి, బంగారు బాబు, దేవేందర్, శరబంద, ఐలయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కీసర, మార్చి 16: ఇటీవల మృతి చెందిన రామిడి తాటిబాయి యాది రెడ్డి కుటుంబాన్ని రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామిడి విజయ్ రెడ్డి ఆదివారం పరామర్శించి వారి కుటుంబానికి విజయ్‌రెడ్డి రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు.